
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 1 జూన్ 2024



ఎన్నికల ఫలితాలపై.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో ఎవరు గెలుస్తారు, ఎన్ని సీట్లు వస్తాయని చూపిస్తున్న మొబైల్ యాప్‌లు

మదనపల్లె టౌన్, మే 31: ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ మ్యాచ్‌లు జరిగినా మారు మూల గ్రామాల నుంచి సైతం బెట్టింగ్ రాయుళ్లు బెట్టింగ్‌లకు పాల్పడుతుంటా రు. బుకీలు, మధ్య వర్తులతో పనిలేకుండా ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్‌ల ద్వా రా నేరుగా వారి మొబైల్ ఫోన్ నుంచి బెట్టింగ్‌లు కాస్తుంటారు. బంతి బంతికి రేటింగ్ మారే ఈ బెట్టింగ్ యాప్‌ల జోరు జిల్లాలో పెద్దగా నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం నుంచి ఈ బెట్టింగ్ యాప్‌లలో దేశంలోని ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగ్‌లు మొదలయ్యాయి.

దేశవ్యాప్తంగా ఎన్‌డీఏ కూ టమికి 304 సీట్లు వస్తాయని ఒక యాప్‌లో, అలియన్స్ కాకుండా బీజేపీ సొంతంగా 250 సీట్లు సాధిస్తుందని మరో యాప్‌లో బెట్టింగ్‌లు పిలుస్తున్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో బీజేపీ ఎన్ని సీట్లు గెలుస్తుంది అనే అంశంపై బెట్టింగ్ యాప్‌లో జోరుగా పందేలు జరుగుతున్నాయి. ఇక రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిలో టీడీపీ అభ్యర్థులు మాత్రమే 89 నుంచి 92 సీట్లు గెలుస్తారని ఒక యాప్‌లో, కూటమి అయితే 103 నుంచి 106 స్థానాల్లో గెలుస్తుందని మరో బెట్టింగ్‌యాప్‌లో పందేలు సాగుతున్నాయి. అంతే కాకుండా రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి 16 నుంచి 18 ఎంపీ స్థానాలు గెలుస్తుందని, వైసీపీ ఎన్ని ఎంపీ, ఎన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలుస్తుందో అనే అంశంపై కూడా బెట్టింగ్ యాప్‌లో పందేలకు పిలుస్తున్నారు.

మదనపల్లె ప్రాంతంలో ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లకు కొంత మంది మధ్యవర్తులు రంగంలోకి దిగారు. ఇరుపార్టీలకు చెందిన వీరాభిమానులను ఒకచోట చేర్చి సీఎం ఎవరు అవుతారు, ఎన్ని సీట్లతో అధికారంలోకి వస్తారనే అంశంపై కూడా మధ్యవర్తులు బెట్టింగ్‌లు పిలుస్తున్నారు. కాకపోతే బెట్టింగ్‌లు కాసేవారు ఎవరు గెలిచినా మధ్యవర్తులకు గెలిచిన సొమ్ములో 5శాతం కమిషన్ ఇవ్వాలని షరతుపెడుతున్నారు. దీంతో చాలా మంది ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని పందేలు కాస్తున్నారు. ఇక్కడ అయితే స్ట్రెయిట్ బెట్టింగ్‌లు వుండటం.. ఎవ్వరికీ కమీషన్‌లు ఇచ్చే అవసరం లేకపోవడంతో క్రికెట్ బెట్టిం గ్‌లకు పాల్పడే చాలామంది ఎన్నికల ఫలితాలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఘర్షణలు, అల్లర్లను ఉక్కుపాదంతో అణచివేస్తాం

- ఎస్పీ కృష్ణారావు




వాల్మీకిపురం, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపధ్యంలో జిల్లా వ్యాప్తంగా ఘర్షణలు, అల్లర్లను ఉక్కుపాదంతో అణచివేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన వాల్మీకిపురం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపధ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30యాక్ట్ అమలులో ఉంటా యని జూన్ 4న ఏ ఒక్కరూ కూడా ఘర్షణలు, విధ్వేషాలకు పోకుండా సంయమనం పాటించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ జరగనున్న జిల్లా కేంద్రం రాయచోటికి అభ్యర్థులు, అనుమతులు ఉన్న ఏజెంట్లు మినహా ఎవరూ వెళ్లరాదని.. నిబంధనలు ఉల్లం ఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం పోలీసుల అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం లాంటి కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్షార్హులవుతారన్నారు. గెలుపోటములపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, కించపరిచేలా వ్యవహరిస్తూ గొడవలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. కార్య క్రమంలో సీఐ పులిశేఖర్, ఎస్ఐ నాగేశ్వర్‌రావ్, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్

- ఎగ్జిట్ పోల్స్ కోసం ఎదురు చూపులు
- ఏ ఇద్దరు కలిసినా.. ఎగ్జిట్‌పోల్స్‌పైనే చర్చ
- అభ్యర్థుల కంటే.. ఆతృతలో బెట్టింగ్ రాయుళ్లు
- నేటి రాత్రికి వెల్లడి.. కొంత క్లారిటీ వస్తుందనే నమ్మకం

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి.. సుమారు 18 రోజులు గడిచిపోతోంది.. ఓట్ల రూపంలో అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తమై స్ట్రాంగు రూంలలో ఉంది. ఓట్ల లెక్కింపునకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. అయితే ఈ లోపు ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయి. ఎవరు గెలుస్తారు.. ఎంత మెజార్టీ వస్తుంది.. ముఖ్యమంత్రి ఎవరు అవుతారు.. సీఎం జగన్‌కు ఈసారి మెజార్టీ తగ్గుతుందా.. చంద్రబాబు మెజార్టీ ఎంత ఉండవచ్చు. పవన్‌కళ్యాణ్, నారా లోకేష్ భవితవ్యం ఎలా ఉండబోతోంది... రాష్ట్రమంత్రుల్లో కొడాలి నాని, వల్లభనేని వంశీ, రోజా గెలుస్తారా.. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభావం ఎంత... ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా ఇవే చర్చలు.. రకరకాల సందేహాలు వినిపిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు జరిగి.. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే వరకు ఓపిక పట్టలేని పలువురు ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.





(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఏడో విడత నేటితో ముగియనున్నాయి. దీంతో శనివారం రాత్రి 6.30 గంటలకు దేశవ్యాప్తంగా జరిగిన ఎన్ని కలపై ఎగ్జిట్‌పోల్ ఫలితాలను పలు మీడియా సంస్థలు, సర్వేసంస్థలు వెలువరిం చను న్నాయి. ఈ ఫలితాల కోసం బరిలో ఉన్న అభ్యర్థులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఎన్నికల్లో పోటీ చేసిన వాళ్లకంటే బెట్టింగ్‌రాయుళ్లలో ఆతృత ఎక్కువ కనిపిస్తోంది. ఇప్పటికే అధికార వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి గెలుపోటములపై కోట్లాది రూపాయలు బెట్టింగులు జరిగాయి. ఓట్ల లెక్కింపునకు ఇంకా నాలుగు రోజులు సమయం ఉండడంతో ఎగ్జిట్‌పోల్స్‌ను బట్టి గెలిచే అభ్యర్థులపైన, మెజార్టీపైన బెట్టింగ్ కాసేందుకు బెట్టింగురాయుళ్లు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం జిల్లాలో అటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు బెట్టింగురాయుళ్లు కూడా ఎగ్జిట్ పోల్ ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారనే చెప్పవచ్చు.

ఎగ్జిట్‌పోల్స్‌పైనే భారం..

మే 13న ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతల్లో జరుగుతుండడంతో.. ఓట్ల లెక్కింపు జూన్ 4న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయిం చింది. అన్ని విడతల పోలింగ్ ముగిసేవరకు ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల సంఘం నిషేధిం చింది. నేటితో (శనివారం)తో ఏడు విడతలు ముగుస్తున్నాయి. ఈ నేపధ్యంలో శనివారం రాత్రి వెలువడబోయే గ్జిట్‌పోల్స్ పైనే పోటీ చేసిన నాయకులు, ముఖ్యనాయకులు, బెట్టింగ్ రాయుళ్లు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ మొద లైనప్పటి నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయి మీడియా సంస్థలు, కొన్ని సర్వేసంస్థలు కూడా ఓటర్ల నాడి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఈసారి ఓటర్లు ఎవరికి పట్టం కట్టబోతున్నారు.. ఓటర్లను ప్రభావితం చేయబోతున్న అంశాలు ఏంటి.. ట్రెండ్ ఎలా ఉండ బోతుంది.. అని ఆరా తీస్తాయి. ఇందులో కొన్ని సంస్థలు క్షేత్రస్థాయిలో ఓటర్ల దగ్గరకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని గుర్తిస్తాయి. కొన్ని సంస్థలు ఫోన్ ద్వారా.. ఇతరత్రా మార్గాల ద్వారా జనం నాడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఒక్కో నియోజకవర్గంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో శాంపిల్స్ సేకరిస్తారు. దీని వల్ల దాదాపుగా జనాభిప్రాయం బయట పడే అవకాశం ఉంటుంది. ఇందులో కూడా కులాల వారీగా, పురుషులు, స్త్రీలు, వృద్ధులు, యువత, ఉద్యోగులు, పెన్షనర్లు, కూలీలు, సామాన్య గృహిణుల అభిప్రాయాలను సేకరిస్తారు. ఏ వర్గం ప్రజలను ఏఏ అంశాలు ప్రభావితం చేస్తున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తారు. అధికారపార్టీ పట్ల ఏ వర్గంలో వ్యతిరేకత ఉందో.. ఎందుకు ఉందో.. గుర్తిస్తారు. అదే విధంగా ప్రతిపక్షానికి అనుకూలమైన అంశాలు ఏంటో కూడా గుర్తిస్తారు. ఇలా విస్తృతంగా జనంలోకి వ్యక్తులుగా వెళ్లలేరు. కాబట్టి నాయకులు సర్వేసంస్థలు, మీడియా సంస్థలకు ఉన్న నెట్‌వర్క్ వల్ల ఎక్కువ మంది జనంతో మాట్లాడగలరు. ఈనేప ధ్యంలోనే.. నాయకులు, ఇతరులు ఎగ్జిట్‌పోల్ ఫలితాల కోసం ఎదురు చూస్తుంటారు.

బెట్టింగ్‌రాయుళ్ల ఆతృత

సాధారణంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో గెలుపోటములపై తీవ్ర ఉత్కంఠ ఉంటుం ది. ఎన్నికలు ముగిసిన తర్వాత పోలింగ్ కేంద్రాల వారీగా తమ ముఖ్యనాయకులు, క్రియా శీల కార్యకర్తలతో మాట్లాడి ఫలితాలు ఎలా ఉండబోతాయో.. ఒక అంచనాకు వస్తారు. అయితే ప్రతిపార్టీ నాయకులు, కార్యకర్తలు తమ నాయకుడే మంచి మెజార్టీతో గెలుస్తాడనే చెప్పడం సర్వసాధారణం. దీంతో పోటీ చేసిన నాయకులు వీళ్ల మాటలపైన అంత నమ్మ కం లేక ఎగ్జిట్‌పోల్ ఫలితాలపైన ఆధారపడతారు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం అభ్యర్థుల కంటే జిల్లాలో బెట్టింగు రాయుళ్ల ఆతృత ఎక్కువగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియ మొదలు కాగానే పలువురు అధికార వైసీపీ గెలుస్తుందనో... ప్రతిపక్ష టీడీపీ గెలుస్తుందనో పందేలు కాశారు. నామినేషన్లు పూర్తి అయి బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరో తేలిన తర్వాత కూడా బెట్టింగురాయుళ్ల పందేలు కాశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. ఈసారి వైసీపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందా... కూటమి వస్తుందా అని ఎక్కువగా బెట్టింగులు జరుగుతున్నాయి. తర్వాత జగన్, చంద్రబాబులకు ఈసారి మెజార్టీ ఎంత వస్తుందనే దానిపై కూడా బెట్టింగులు జరుగుతున్నాయి. పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లు గెలుస్తారా.. ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై బెట్టింగులు జోరుగా పెడుతున్నారు. తమ నోటి దురుసుతో రాష్ట్ర వ్యాప్తంగా వివాదాస్పదంగా మారిన పలువురు రాష్ట్ర మంత్రులు గెలుస్తారా.. ఓడిపోతారా అని అంశంపైనా బెట్టింగులు జరుగుతున్నాయి. కడప పార్లమెంటుకు పోటీ చేసి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభావం ఎంత ఉంటుంది.. గెలుస్తుందా అని కూడా జోరుగా బెట్టింగులు కాస్తున్నారు. ఇలా బెట్టింగులు కట్టిన వాళ్లంతా.. వేయి కళ్లతో శనివారం వెలువడబోయే ఎగ్జిట్‌పోల్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఎగ్జిట్ పోల్ కాలం నడుస్తోందని చెప్పవచ్చు.

కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరుస్తాం

- ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్



ఈవీయంలు భద్రపరిచే రాయచోటి మార్కెట్‌యార్డు గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటిటౌన్, మే 31: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ అనంతరం నియో జకవర్గాల వారీగా అసెంబ్లీ, పార్లమెంట్ ఈవీయంలను గోదాములో భద్రపరుస్తామని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి మార్కెట్‌యార్డు వద్ద ఉన్న ఈవీయంలు భద్రపరిచిన గోడౌన్‌ను వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాము లోపల నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన విభా గాలను, గోదాములో ఉన్న డిఫెక్టివ్ ఈవీయం, వీవీ ప్యాట్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ అనంతరం ఈవీయంలను ఆయా నియోజకవర్గాల వారీగా విడివిడిగా గోదాములో భద్రపర్చి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో తీసుకుంటున్న చర్యలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఈవీయం జిల్లా నోడల్ అధికారి, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌అండ్‌బీ అధికారి సహదేవరెడ్డి, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా జరిగేందుకు క్రమశిక్షణతో మెలగాలని.. త్వరితగతిన ఫలితాలు వెల్లడి అయ్యేలా పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిమిత్తం చేస్తున్న ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్స్ లేఅవుట్, కౌంటింగ్ ఏజెంట్ల అపాయింట్మెంట్ పద్ధతి, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియమాలు తదితర అంశాల్లో తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు పూర్తిగా సహకరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అత్యంత పటిష్టంగా మూడు లేయర్ల బందోబస్తు ఏర్పాటు చేశామ ని చెప్పారు. అనవసరమైన అల్లర్లు, సమస్యలు సృష్టిస్తే అలాంటి వారిని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి పంపడమే కాకుండా హద్దు మీరు ప్రవర్తిస్తే అరెస్టు చేయవచ్చునని, ఎన్నికల కమిషన్ స్పష్టంగా పేర్కొందని చెప్పారు. గెలుపోటములను సమభావంతో తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, కలెక్టరేట్ ఎలెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావు, పార్లమెంట్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాక్‌పాట్ వద్దే.. వద్దు!

జాక్‌పాట్ విధానం రద్దు చేయాలంటూ టమోట రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ విధానంపై ప్రతి ఏటా రైతన్నలు మార్కెట్‌యార్డు వద్ద ధర్నాలు చేపట్టడం.. ఆ సమయంలో అధికారులు జాక్‌పాట్‌ను రద్దు చేస్తామంటూ ప్రకటించడం.. రెండు రోజుల పాటు వ్యాపారులు సైలెంట్ కావడం... ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు.. మళ్లీ వ్యాపారులు నెమ్మదిగా జాక్‌పాట్ విధానాన్ని అమలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో టమోటా సాగు చేసిన ప్రతి రైతు ధరలున్న సమయంలో జాక్‌పాట్ విధానంతో సుమారు రూ.50 వేల నుంచి లక్షల్లో నష్టపోతున్నారు.



టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- టమోటా రైతుల ఆవేదన, ఆక్రందన
- గుర్రంకొండ మార్కెట్‌యార్డులో వ్యాపారుల నిలువు దోపిడీ
- రూ.లక్షల్లో నష్టపోతున్నరైతులు
- చోద్యం చూస్తున్న మార్కెట్‌శాఖ అధికారులు



గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చిన టమోటాలు

గుర్రంకొండ, మే 31: గుర్రంకొండ మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ దెబ్బకు రైతులు విలవిలలా డుతున్నారు. ఈ జాక్‌పాట్ విధానంతో వేలాది రూపాయలను నష్టపోతున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి రైతన్నలు టమోట పంటను పండిస్తారు. పంట దిగుబడి వచ్చే సమయంలో టమోటాకు ధరలుంటే రైతన్నలు లాభాలను గడిస్తారు. ధరలు పతనమైతే అప్పులు మూటగట్టుకుంటారు. గత కొన్ని నెలలుగా టమోటాకు ధరలు లేకపోవడంతో పంట సాగు చేసిన రైతన్నలు నష్టాలను చవిచూశారు. ఈ నేపధ్యంలో పది రోజులుగా టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పంట పండించిన రైతులు టమోటాలను మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు. ఇదే అదునుగా ఇక్కడ వ్యాపారులు జాక్‌పాట్ విధానం ముసుగులో రైతులను నిలువునా దోచుకుంటున్నారు.

జాక్‌పాట్ విధానం ఇలా...

టమోటాలను పండించిన రైతులు మార్కెట్‌యార్డుకు తీసుకొస్తారు. ఇక్కడకి రాగానే 25 కిలోల బరువు గల వంద క్రేట్‌ల టమోటాలను గ్రేడింగ్ పేరిట 90 క్రేట్‌లకు కుదిస్తారు. ఈ 90 క్రేట్‌లకు వేలం పాటలను నిర్వహించినపుడు జాక్‌పాట్ పేరిట 10 క్రేట్‌లకు రెండు చొప్పున 18 క్రేట్‌లను తీసేస్తారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో కిలో టమోటా ధర రూ.35 నుంచి 40 రూపాయల వరకు పలుకుతోంది. ఈ లెక్కన వంద క్రేట్‌ల టమోటాలు తెచ్చిన రైతు జాక్‌పాట్ పేరిట దాదాపుగా 25 క్రేట్‌లను నష్టపోతున్నాడు. దీంతో రైతు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చిన ప్రతి సారి సుమారుగా రూ.20 వేలుకు పైగా జాక్‌పాట్‌తో నష్టపోతున్నాడు.

జాక్‌పాట్‌ను ప్రశ్నిస్తే రైతుకు కష్టాలే..

గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో వ్యాపారులందరూ జాక్‌పాట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ విధానాన్ని రైతులు ప్రశ్నిస్తే వారి కష్టాలు వర్ణాతీతం. ఆ రైతు టమో టాలను చాలా తక్కువ ధరకు వేలం పాడుతారు. లేదంటే ఇష్టమున్న చోట అమ్ము కోమంటూ బెదరిస్తారు. మరికొందరు వ్యాపారులైతే ప్రశ్నించే రైతు టమోటాలను మండీల్లో దింపుకోవడం లేదు. దీంతో చేసేది లేక రైతన్నలు జాక్‌పాట్ విధానానికి తలవంచక తప్ప డం లేదు. ఈ తతంగమంతా మార్కెట్‌శాఖ అధికారుల కళ్లముందు జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది.

జాక్‌పాట్ రద్దు కాగితాలకే పరిమితం

గుర్రంకొండ మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ విధానం రద్దు కాగితాలకే పరిమితమైంది. ఈ విధానాన్ని కొన్నేళ్ల క్రితమే అధికారులు రద్దు చేశారు. అయినప్పటికీ వ్యాపారులు జాక్‌పాట్ విధానాన్ని ఇష్టానుసారం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పలుమార్లు రైతులు రోడ్డు ఎక్కి ధర్నాలు చేయడం.. ఆ రెండు రోజులు అధికారులు దగ్గరుండి జాక్‌పాట్‌ను నియంత్రించడం ... ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు ఈ విధానం కొనసాగడం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.

జాక్‌పాట్‌ను నిర్వహిస్తే చర్యలు తప్పవు..

గుర్రంకొండ మార్కెట్‌యార్డులో వ్యాపారులు జాక్‌పాట్ విధానాన్ని కొనసాగిస్తే చర్యలు తప్పవు. ఈ విధానాన్ని కొన్నేళ్ల క్రితమే రద్దు చేశారు. జాక్‌పాట్ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకొంటాం.

- కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకి పురం


30 క్రేట్‌లు జాక్‌పాట్ అనకుండా తీసేశారు..



రెండు రోజుల క్రితం 140 క్రేట్‌ల టమోటాలను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడకి రాగానే 140 క్రేట్‌లు కాస్తా భర్తీలు లేవని 10 క్రేట్‌లను కోసేయగా 130 క్రేట్‌లకు వచ్చాయి. ఇక వేలం పాటల సమయంలో జాక్‌పాట్ అనకుండానే 20 క్రేట్‌లను తీసేసి 110 క్రేట్‌లకు వేలం పాడారు. క్రేట్ ధర రూ.800 పలకగా అందులో మళ్లీ రూ.40 తగ్గించారు. ఇలా జాక్‌పాట్, అధిక కమిషన్‌లతో వ్యాపారులు ఇష్టానుసారం దోచుకుంటున్నారు.

- శ్రీనివాసులు, రైతు, పసలవాండ్లపల్లె, గుర్రంకొండ, మండలం

జాక్‌పాట్ వద్దంటే, తక్కువ ధరకే..



వ్యాపారులు జాక్‌పాట్ వద్దంటే చాలా తక్కువ ధరకు టమోటాలను కొనుగోలు చేస్తారు. ఇదేమని ప్రశ్నిస్తే కాయలు సరిగాలేవంటూ కుంటి సాకులు చెబుతారు. మరిసటి రోజు పక్క మండీలకు వేస్తే వారు కూడా ఇలానే చేస్తారు. దీంతో చేసేది లేక వ్యాపారులు పాడిన పాటకే టమోటాలను అమ్ముకోవాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేసే అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో రెండు రోజులైనా కార్యదర్శి అందుబాటులో ఉంటే రైతుల బాధలు తెలిసేవి.

- శేఖర్‌రెడ్డి, రైతు, వరపనవారిపల్లె, గుర్రంకొండ, మండలం

ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు సిద్ధం

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జేడీఏ చంద్రనాయక్

లక్కిరెడ్డిపల్లె మే 31: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి విత్తనకాయలు, ఎరువులు సిద్ధం గా ఉన్నాయని.. అన్ని రైతు భరోసా కేంద్రాలకు తరలించి పంపిణీ చేస్తున్నామని వ్యవ సాయ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అనంత పురం, చౌటపల్లె రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఖరీఫ్‌కు సంబంధించి వేరుశనగ విత్తనకాయలు, పచ్చిరొట్ట, కందులు, వరి విత్తనాలు జిల్లాలోని అన్ని ఆర్బీకేలలో అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 55,300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు, 510 టన్నుల పచ్చరొట్ట, జనుమ, జీలుగలు, 45 మెట్రిక్ టన్నుల ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. మిగిలిన 25 మెట్రిక్ టన్నుల ఎరువులను సొస్సై టీలు, డీలర్ల ద్వారా రైతులకు అందజేశాస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా లక్షా 70వేల ఎకరాలలో సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నామని.. వేరుశనగపంట లక్షా 7వేల ఎకరాలు, వరి 25వేల ఎకరాలు, కంది 7వేల ఎకరాలలో సాగుకు సన్నద్ధం చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్‌బాబురావు, ఏఏఓ నాగరాజు తదితరులు పాల్గొ న్నారు.

నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

వేరుశనగ విత్తపుకాయల నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని జిల్లా వ్యవసా యశాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వేరుశనగ విత్తనపుకాయల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం రైతు భరోసా కేంద్రానికి తరలించిన వేరుశనగ విత్తనంకాయలను తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న వేరుశనగ విత్తనకాయలు పంపిణీ సాగుతోందని.. నాణ్యత విషయంలో మండలాల వ్యవసాయ అధికారులు, సహా య వ్యవసాయ సంచాలకులు రాజీ పడకూడదన్నారు. నాణ్యత సరిగ్గా లేని కాయల లోడును వెంటనే వెనక్కి పంపించాలని తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో పనిచేసే సిబ్బంది వేరుశనగ విత్తపుకాయల నాణ్యత సరిగ్గా లేకుంటే వెంటనే వెనక్కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీలత, రాయచోటి మండల అధికారి దివాకర్‌బాబు, సచివాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు వేరుశనగవిత్తనకాయలను అందజేస్తున్న జేడి చంద్రనాయక్

వెటర్నరీవర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొఫెసర్ శ్రీలత

తిరుపతి రూరల్, మే 31: తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీ తాత్కాలిక డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొద్దుటూరులోని వెటర్నరీసైన్స్ కళాశాల పాథాలజీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతని నియమిస్తూ వర్శిటీ వీసీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీఆర్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో.. శ్రీలతని తాత్కాలిక డీఆర్‌గా నియమించారు. దాంతో శ్రీలత ఆ బాధ్యత చేపట్టారు. కాగా ప్రభుత్వం పెంచిన 65 సంవత్సరాల సర్వీసుకు హైకోర్టు ఇంటీరియమ్ ఆర్డర్‌తో సర్జన్‌రావుని ప్రొఫెసర్‌గా కొనసాగిస్తూ వర్శిటీ రిజిస్ట్రార్ అరుణాచలం రవి ఉత్తర్వులు వెలువరించారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ప్రొఫెసర్ శ్రీలత నియామకంపై ఏపీ ఎన్నికల కమిషన్ అధికారి(సీఈవో) అనుమతి తీసుకున్నారా అన్న అంశంపై రిజిస్ట్రార్‌ని వివరణ కోరగా.. 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, వర్శిటీ పాలకమండలిలో పెట్టి రాటిఫికేషన్ తీసుకుంటామని వివరించారు.

ఆర్‌అండ్‌బీలో నరసింహారెడ్డి సేవలు మరువలేనివి



పదవీ విరమణ చేసిన ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఈ మహేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు,మే 31 : ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ శాఖలో ఈఈగా పనిచేసిన నరసింహారెడ్డి సేవలు మరువలేనివని ఆశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక ఎస్‌కేవీ ఫంక్షన్ హాలులో ఆర్‌అండ్‌బీ ఈఈ నరసింహారెడ్డి పదవీ విరమణ సభ ఘనంగా జరిగింది. ఈసభలో నరసింహారెడ్డిని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 36 ఏళ్లుగా నరసింహారెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖలో సేవలందించారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈ సీపీ రెడ్డిశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్ఈలు వెంకటరామిరెడ్డి, జయరామిరెడ్డి, పుల్లయ్య, రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మాధవి, కడప ఈఈ ప్రభాకర్‌నాయుడు, రాజంపేట ఈఈ సహదేవరెడ్డి, పులివెందుల ఈఈ సిద్ధారెడ్డి, ఈఈ భాస్కర్‌రెడ్డి, నంద్యాల డీఆర్‌ఈవో శ్రీధర్‌రెడ్డి, ఏపీ ఐసీసీ జోనల్‌మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఈఈ లక్ష్మీనరసింహులు, ఎన్ కంభగిరి, ఏఈ రామక్రిష్ణారెడ్డి, సునీల్ కుమార్, బాషా, అభిలాష్‌రెడ్డి, రజియా, గిరి ఆర్కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు
నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

నీకేదిన్నె, మే 31: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికిగాను అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని వ్యవసాయ పరిశోధన కేంద్రం ఊటుకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసాచారి తెలిపారు. రాష్ట్రంలోనూ వివిధ జిల్లాల్లో ఉన్న 17 ప్రభుత్వ, 58 అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం రెండు సంవత్సరాల కోర్సు నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్, వ్యవసాయ ఇంజనీరింగ్‌కు సంబంధించిన డిప్లమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ శనివారం నుంచి ప్రారంభమవుతుందని చివరితేది జూన్ 20 తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000523420 నంబరును సంప్రదించాలన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం.. కేసు నమోదు



లక్కిరెడ్డిపల్లె, మే 31: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా గరుగపల్లె ఏరు నుంచి నూలివీడుకు 18 టన్నుల ఇసుకను తరలిస్తుండగా టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని గాలివీడు పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నాగరాజు, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

60 మంది గృహ నిర్బంధం..
ఇద్దరు జిల్లా బహిష్కరణ

రాజంపేట టౌన్, మే 31 : రాజంపేట డివిజన్ పరిధిలో 62 మందికి పైగా హౌస్ అరెస్టు, ఇద్దరిని జిల్లా నుంచి బహిష్కరించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎన్నికల అనంతరం అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో గుర్తించిన వ్యక్తులకు ఇప్పటికే నోటీసులను జారీ చేసినట్లు తెలుస్తోంది. దాసరి పెంచలయ్య, రాజారెడ్డి అనే వ్యక్తులను జిల్లా నుంచి బహిష్కరించగా, 60 మందిఇ పైగా పలు పార్టీల నేతలు, కార్యకర్తలను గృహ నిర్బంధం చేసినట్లు తెలిపారు. నోటీసులు స్వీకరించినవారు 4, 5వ తేదీల్లో ఎలాంటి ఘటనల్లో పాలు పంచుకోరాదని హెచ్చరించారు. పోలీసుల సూచనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చైతన్య తెలిపారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైనందుకు
హెచ్‌ఎంకు రెండు ఇంక్రిమెంట్లు కట్

కడప (ఎడ్యుకేషన్), మే 31 :ఎన్నికల విధులకు గైర్హాజరైన కారణంగా వేంపల్లె జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసినట్లు ఆర్జేడీ వై. రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమె ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సీసీ అండ్ ఏ రూల్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

కరువు కాటేసింది

- నిట్టనిలువునా ఎండిపోతున్న మామిడి తోటలు
- చెట్లను బతికించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్న రైతులు
- వరుణుడి కోసం ఎదురుచూపులు
- ట్యాంక్ రూ.700 అయినా నీళ్లు దొరకని వైనం



ఉన్న బోరు ఎండిపోవడంతో మరో బోరు వేస్తున్న దృశ్యం



నీళ్లు లేక ఎండిపోయిన మామిడి చెట్లు

లక్కిరెడ్డిపల్లె, మే 31: వర్షాలు సక్రమంగా కురవక కరువు కాటేయడంతో రైతులు అల్లాడిపోతున్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం అసలే మిట్ట ప్రాంతం. వర్షాలు కురిస్తేనే పంటలు పండుతాయి. ఈ ప్రాంతానికి ఎలాంటి ప్రాజెక్టులు, నదులూ లేవు. వర్షం ఆధారంగానే పంటలు సాగు చేయాలి. సకాలంలో వర్షాలు కురవక పోతే ఆ ఏడాది పంటలు నేలపాలే. ఈ ప్రాంతంలో వేరుశనగ ప్రదానమైన పంట. ప్రతి ఏటా వేరుశనగ సాగుచేయడం.. అతివృష్టి లేదా అనావృష్టితో చేతికందే సమయంలో పంట నేలపాలై చివరికి అప్పులే మిగిలేవి. దీంతో చాలామంది రైతులు రెండు దశాబ్దాలుగా క్రమంగా మామిడి సాగువైపు దృష్టి మరలించారు. ప్రస్తుతం లక్కిరెడ్డిపల్లె మండలంలో మామిడితోటలు పెద్దఎత్తున సాగులో ఉన్నాయి. అయితే.. ఈ ఏడాది వర్షాలు కురవక బోరుబావులు ఎండిపోయాయి. 20 నుంచి 30 సంవత్సరాల వయసున్న మామిడి చెట్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

జనవరి నెలలో బోర్లల్లో అరకొర వచ్చిన నీటితో మార్చి నెల వరకు చెట్లను బతికించుకున్నారు. తీరా పూత పిందెతో ఉన్న సమయంలో నీరు లేకపోవడంతో మామిడిచెట్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. కొంతమంది రైతులు మామిడి చెట్లను బతికించుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కొత్తబోర్లు వేస్తున్నారు. మరి కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని తోలాలన్నా మండలంలో ఎక్కడా నీరు లభ్యం కావడం లేదు. దీంతో పొరుగు మండలాల నుంచి ట్యాంకర్ రూ.700 నుంచి రూ.1000 ఖర్చుతో తోలించి చెట్లను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా 20 నుంచి 30 సంవత్సరాల చెట్లకు నీరు చాలక ఎండిపోతున్నాయి.

మండలంలో 15 ఎకరాలకుపైగా మామిడితోటలు ఉన్న పెద్దకారు రైతులు ప్రతి ఏటా మంచి దిగుబడులు తీసేవారు. ఈ ఏడాది ఆదాయం దేవుడెరుగు చెట్లను బతికించుకుంటే చాలన్నట్లుగా అష్టకష్టాలు పడుతున్నారు. ఎక్కువగా బి.ఎర్రగుడి పంచాయతీలోని కాపుపల్లె, పాళెంగొల్లపల్లె, మామిడిగారిపల్లె, కోనంపేట, దప్పేపల్లె పంచాయతీల్లో మామిడితోటలపై ఆధారపడి చాలామంది రైతులు జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది నీరులేక చెట్లలో పూత పిందె నిలవక దిగుబడులు రాలేదు. దీనికితోడు చెట్లను బతికించుకోవడానికి లక్షల రూపాయలు ఖర్చులు పెడుతున్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినా ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

రెండెకరాల్లో మామిడి చెట్లు ఎండిపోయాయి..



ఏటా వేరుశనగ పంట సాగుచేసి పూర్తి స్థాయిలో నష్టపోయాను. దీంతో 15 సంవత్సరాల నుంచి 15 ఎకరాల్లో మామిడితోటలు సాగుచేశాను. పంట దిగుబడి బాగా వస్తే ఏటా రూ.20 నుంచి రూ.30లక్షలు లాభాలు వచ్చేవి. ఈ ఏడాది వర్షాలు లేక 10 బోర్లల్లో నీళ్లు ఆగిపోయాయి. దీంతో 2 ఎకరాల్లో మామిడి చెట్లు ఎండిపోయాయి. ఇప్పటి వరకు నీళ్ల తోలేందుకు ట్యాంకర్లకు రూ.3లక్షలు ఖర్చు పెట్టినా. ప్రభుత్వం ఆదుకోవాలి.

- బండ్రేరెడ్డి శంకర్‌రెడ్డి, రైతు, బి.ఎర్రగుడి

అప్పులు చేసి చెట్లను బతికించుకుంటున్నా..



30 సంవత్సరాల చెట్లు నీరు లేక నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. చెట్లను వదులుకోలేక అప్పులు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి మామిడిచెట్లను కాపాడుకుంటున్నా. అయినా కొన్ని మామిడి చెట్లు ఎండిపోయాయి. లక్షల రూపాయలు అప్పులు చేసి బోర్లు వేశాను. నీరు పడలేదు. ప్రభుత్వం ఏ రూపంలోనూ మాకు సహాయం చేయలేదు.

- రాజశేఖర్‌రెడ్డి, రైతు, కాపుపల్లె



ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీరు పడుతున్న రైతు రాజశేఖర్‌రెడ్డి

ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

- రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి



రాయచోటి(కలెక్టరేట్), మే31: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓట్ల లెక్కింపుపై రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని అంశాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో కౌంటింగ్ నిర్వహించాల్సి ఉంటుందని, ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోరాదన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఇప్పుడే నివృత్తి చే సుకోవాలన్నారు. కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది అందరూ జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకోవాల్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వచ్చిన వెంటనే ఆర్వోకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు డీపీవో ధనలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపై డీజిల్ పోసుకుని
వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 31: జమ్మలమడుగు మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో గురువారం షైల మహేంద్రయాదవ్ (33) అనే వ్యక్తి ఇంట్లో ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు షైల మహేంద్రయాదవ్ 2019 నుంచి గండికోట కొట్టాలపల్లె గ్రామంలో నివాసం ఉన్నాడు. ఈయన స్థానిక గాలిమరల వద్ద ఉద్యోగం చేసుకుంటూ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య వరలక్ష్మి, కుమారుడు చైతన్య, కూతురు రోహిత ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం కుమారుడు చైతన్య అనారోగ్యంతో మృతిచెందాడు. కొడుకు చనిపోయాడని బెంగపెట్టుకుని అప్పటి నుంచి బాధపడుతూ ఉండేవాడు. కొడుకుపై బెంగతో ఇంటికి డీజిల్ తెచ్చుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన షైల మహేంద్రయాదవ్ జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కాగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు.

ఏపీ ఈసెట్‌లో
ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ

సింహాద్రిపురం, మే 31: సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తృతీయ సంవత్సరం ఈఈఈ విద్యార్థి దావూద్ హుస్సేన్ 2024 ఏపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 105 ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిమ కనబరచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. దీంతో ఈఈఈ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శివశంకర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. దావూద్ హుస్సేన్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అనంతపురం, నెల్లూరు జట్ల ముందంజ





అత్యధిక పరుగులు సాధించిన అర్జున్ టెండూల్కర్ (61), వంశీకృష్ణ (100), ఫర్హాద్ ఖాద్రి (102)

కడప (కల్చరల్), మే 31: కడప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ ఒన్ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం చిత్తూరు- అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 143 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 47.4 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 249 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 61 పరుగులు చేయగా మరో బ్యాటర్ బి. వినయ్‌కుమార్ 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 32.3 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి కేవలం 146 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి చవిచూసింది. ఇందులో ధరణికుమార్ నాయుడు మాత్రమే 26 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు 143 పరుగుల తేడాతో విజయం సాధించింది.

8 వికెట్ల తేడాతో నెల్లూరు విజయం

కడప కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో శుక్రవారం కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో క్రికెట్ మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 46.1 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో వంశీకృష్ణ (బ్యాటర్) సరిగా 100 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు 36.5 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 230 పరుగులు సాధించింది. ఇందులో ఫర్హాద్ ఖాద్రి (బ్యాటర్) 102 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నెల్లూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



గూడెంచెరువు మలుపు వద్ద గ్రావెల్ లోడుతో వెళుతున్న టిప్పర్



పెన్నానది వంతెనపై గ్రావెల్‌తో తరలిపోతున్న టిప్పర్



గూడెం చెరువు మలుపు వద్ద సుద్దరాయి, మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

జమ్మలమడుగు, మే 31: జమ్మలమడుగులో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయిదు సంవత్సరాల నుంచి జమ్మలమడుగు పరిసర ప్రాంతాలు, గండికోట దారి, పెన్నానదిలో మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నా అధికార పార్టీ భయంతో అధికారులు సైతం నోరు విప్పలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు అధికారుల అండతో అక్రమ రవాణాలో జోరు పెంచారని విమర్శలున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు మండలం గూడెంచెరువులో గూడాదేవి చెరువు వద్ద నుంచి ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లకు మట్టి నింపుకుని పెద్దఎత్తున తరలించేస్తున్నారు. అలాగే గండికోట వెళ్లే దారి నుంచి టిప్పర్లలో సుద్దమట్టి, గ్రావెల్, జోరుగా తరలిస్తున్నారు. సమీప గ్రామాలకు చెందిన రెవెన్యూ సిబ్బందికి ఈ విషయం తెలిసినప్పటికి ఏ ఒక్కరికీ అడిగే ధైర్యం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గండికోట దారి నుంచి గూడెం చెరువు మీదుగా జమ్మలమడుగు పట్టణం పెన్నానది వంతెనపై అతివేగంతో ట్రాక్టర్లు, టిప్పర్లు మట్టి తరలిస్తున్నా ఒక్క అధికారి కూడా ప్రశ్నించకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత యథేచ్ఛగా పట్టపగలే మట్టి తరలిస్తున్నా చెక్‌పెట్టేవారే కరువయ్యారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం ఉదయం గూడెం చెరువు పాఠశాల వద్ద మలుపులో ద్విచక్ర వాహనం, టిప్పర్లు, ట్రాక్టర్ల మధ్య ప్రమాదం జరిగేదని అంటున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు అతివేగంగా రావడంపై కొందరు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది.

హనుమజ్జయంతికి ముస్తాబైన ఆలయాలు



భక్తాంజనేయస్వామి ఆలయం

రైల్వేకోడూరు, మే 31: హనుమజ్జయంతికి ఆలయాలను ముస్తాబు చేశారు. రైల్వేకోడూరు పట్టణంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకంతో పాటు ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. భక్తులకు స్వామి వారి దర్శనం సులభతరం చేసేందుకు ఆలయ ధర్మకర్త కలపాటి వేంకటేశ్వర్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చలువ పందిర్లు వేశారు. మామిడి తోరణాలు కట్టారు. పూలతో అలంకరణలు చేశారు.

చిట్వేలి: హనుమాన్ జయంతి సందర్భంగా .చిట్వేలిలోని బ్రాహ్మణవీధి, తిమ్మాయపాలెం క్రాస్ , రాజుకుంట క్రాస్, తిమ్మయ్యగారిపల్లె తదితర ఆలయాల్లో ఘనంగా ఏర్పాట్లు చేశారు. బ్రాహ్మణవీధి భక్తాంజనేయస్వామి ఆలయంలో ఉదయం గణపతిపూజ, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం అలంకరణ, అష్టోత్తర పూజ, మహానైవేద్యం, నవగ్రహారాధన, మంగళ హారతితో పాటు స్వస్తివాచనం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.

సిద్దవటం: కనుమలోపల్లెలోని దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 1వ తేదీన శనివారం పూజలు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్షుమయ్య తెలిపారు.

వికసించిన మే పుష్పాలు



వికసించిన మే పుష్పాలు

రైల్వేకోడూరు, మే 31: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తంబిళ్లవారిపల్లెకు చెందిన పంజం విజయరంగారెడ్డి ఇంటి ఆవరణలో శుక్రవారం మే పుష్పాలు వికసించాయి. . లిల్లీ జాతికి చెందిన ఈ మొక్కలు ప్రతి ఏడాది మే నెల లోనే వికసిస్తాయి. ఈ మొక్కను నేలలో ఒక సారి నాటితే చనిపోవడం ఉండదు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది.

12 నుంచి గంగమ్మ జాతర

రైల్వేకోడూరు, మే 31: పంచాయతీ పరిధిలోని కొత్త కోడూరులో ఈ నెల 12, 13, 14 తేదీల్లో గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెన్నంశెట్టి కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బుధవారం చాటింపు వేశామన్నారు. జాతర అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జాబ్ మేళాలో 30 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళా లో ఎంపికైన యువతీ, యువకులు

రైల్వేకోడూరు, మే 31: పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 72 మంది హాజరు కాగా 30 మందికి ఉద్యోగాలు లభించినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, కళాశాల డైరెక్టర్ పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దండువారమ్మ ఊరేగింపు

సుండుపల్లె, మే31: మండలం లోని భాగంపల్లి గ్రామ పంచా యతీ కుంటలముందరలో దం డువారమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పూజలు చేశారు. భక్తాదులకు తీర్థప్రసాదాలను అం దజేశారు. సాయంత్రం అమ్మ వారి ని ఊరేగించారు.

గంగమ్మ జాతరలో ముక్కా కస్తూరి

పుల్లంపేట, మే 31 : గంగమ్మ జాతర సందర్భంగా మండల పరిధిలోని బావికాడపల్లెను నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఇన్చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సుధాకర్నాయుడు, సంజయ్గాంధీ వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎన్నికల ఫలితాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్నాయుడు, అజయ్బాబు, వెంకట సుబ్బయ్యయాదవ్, ముద్దాగంగిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు



పెన్నానదిలో ఇసుక తవ్వుతున్న ప్రాంతం

సిద్దవటం,మే 31 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. సిద్దవటం మండలం టక్కోలు గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆనుకుని వున్న రహదారి మీదుగా పెన్నా నదిలోని ఇసుకను ఎక్స్కవేటర్ల సాయంతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు, భూగర్భ జలాలు అడుగంటడంతో, నదీ పరివాహక ప్రాంతాల్లోని పొలాలు బీళ్లుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై. స్థానిక వీఆర్వో చంద్రను వివరణ కోరగా రాత్రి వేళలో ఇసుక రవాణా జరుగుతన్నట్లు కొంతమంది రైతులు తన దృష్టికి తీసుకు వచ్చారని ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● ఏఎస్పీ రాజ్కమల్ ఆధ్వర్యంలో పోలీసులు మాక్ డ్రిల్



మాక్డ్రిల్లో భాగంగా అల్లరి మూకలను చెదరగొడుతున్న పోలీసులు

రాయచోటిటౌన్, మే 31: కౌంటింగ్ రోజున శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్కమల్ అన్నారు. ఈ నెల నాల్గవ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్న దృష్ట్యా రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని, జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహణకు అనుమతి లేదన్నారు. చట్టాని ఉల్లంఘిస్తే ఎలాంటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైనా, అవాంఛనీయ, హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటే అల్లరి మూకలను ఏ విధంగా చెదరగొట్టాలో తెలియ జేస్తూ పోలీసులు మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ను విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, సెక్షన్ 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందని, ఎవరైనా చట్టాలను అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో జిల్లా ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. డీఎస్పీ శ్రీరామచంద్రరావు, రాయచోటి టౌన్ సీఐ సుధాకర్రెడ్డి, ఆర్ఐ వెంకటచలపతి, ఆర్ఐ పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం శుచిగా తయారు చేయాలి



రైల్వేకోడూరు: వంట పోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లెలో..



రైల్వేకోడూరు, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యత గల భోజనాలు తయారు చేయాలని మండల విద్యాశాఖాధికారులు పోతురాజు రామయ్య, సుందర్బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్ఎంఎం హైస్కూలు లో వంట ఏజెన్సీలు, హెల్పర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట ఏజెన్సీలు, హెల్పర్లు ప్రభుత్వ మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనాలు తయారు చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్నారు. వంట వస్తువులు వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్పర్సన్లు టీ. శివశంకర్రెడ్డి, హెచ్ఎంఎం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు కె. వెంకటరమణ, ఉపాధ్యాయులు కె. ఫణీంద్రయాదవ్, ఎంసీ సంపత్కుమార్, బీవీ విక్రమవర్మ, కె. విజయకుమార్, విద్యాశాఖ సిబ్బంది ఎన్. బాలాజీ, పీ. సుబ్రహ్మణ్యం, సీ. అరుణ, కె. అరుణకుమారీ, డీ. గోపీక్రిష్ణ, వంట ఏజెన్సీ, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి (2) వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో మండలంలోని వంట ఏజెన్సీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జూన్12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని వంట ఏజెన్సీలు అన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు మెను తప్పక పాటించాలని సూచించారు అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. మంచి వంటలను చేసిన మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీయూఎస్ జిల్లా మీడియా ఇచార్జి వెంకటేశ్వర్లు , సీఆర్పీలు రామ్మోహన్, శశికళ, చంద్రకళ పాల్గొన్నారు

జగన్మోహన్రాజు, రమేష్నాయుడుకు సత్కారం



జగన్మోహన్రాజు, రమేష్నాయుడులను సత్కరిస్తున్న గ్రామస్థులు

రాజంపేట, మే 31 : గంగమ్మ జాతర సందర్భంగా పుల్లంపేట మండలం బావికాడపల్లెలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్నాయుడు పర్యటించారు. గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో ఎన్డీఏ కూటమి విజయం తథ్యమన్నారు. మోదీ, చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని సత్కరించారు. మురళీ, వేణుగోపాల్, నాగేంద్ర, దివా కర్, శివ, సుబ్బ నరసయ్య, వెంకటేశ్వర చౌదరి, సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పోలి సుబ్బారెడ్డి భేటీ



చంద్రబాబు నాయుడును సత్కరిస్తున్న పోలి సుబ్బారెడ్డి

రాజంపేట, మే 31 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బా రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఎన్నికల తరువాత విదేశాల నుంచి వచ్చిన చంద్రబాబు నాయుడును హైదరాబాదులోని ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. రాజంపేట నియోజక వర్గంలో టీడీపీ గెలుపొం దడం ఖాయమని అధినేత చంద్రబాబుకు తెలిపామన్నారు. ఈ సందర్భంగా పోలిసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్ర బాబునాయుడు, కేంద్రంలో మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

ఏజెంట్లకు మాత్రమే కౌంటింగ్ హాల్లోకి అనుమతి



గాలివీడు: రాజకీయనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జీవన్గంగాధర్బాబు



సిద్దవటం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

గాలివీడు, మే31: కౌంటింగ్ రోజు ఏజెంట్లకు తప్ప మిగిలిన వారికి అనుమతి లేదని, ఇతరులెవ్వరూ కౌంటింగ్ కేంద్రం వద్దకు రావద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్ బాబు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్ఐ వెంకటప్రసాద్తో కలిసి గాలివీడు పోలీస్ స్టేషన్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల సందర్భంగా రాయచోటి పట్టణంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అనవసరంగా అక్కడికి వచ్చి ఇబ్బందులకు గురికావద్దన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తుకు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు రవీంద్రబాబు, మహమ్మద్ రియాజ్, మహమ్మద్రఫీ, మిట్టపల్లి వెంకట్రమణారెడ్డి, ప్రభాకర్రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: ఫలితాల అనంతరం ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదని ఎన్నికల డీఎస్పి బాషాజీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్స్టేషన్లో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. జూన్ 1 నుంచి సెక్షన్ 39, 144 సెక్షన్ అమల్లో వుంటాయన్నారు. ఎక్కడ కూడా నలుగురు గుంపులుగా ఉండకూడదన్నారు. బాణాసంచా పేల్చకూడదన్నారు.గ్రామాల్లో గొడవలు జరగకుండా ప్రశాంతంగా వుండాలన్నారు.

సిద్దవటం : మండలంలోని సిద్దవటం, భాకరాపేట గ్రామాలలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్ఐ పెద్దఓబన్న గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఎటువంటి గొడవలు పడకుండా ఉండాలన్నారు. ఘర్షణలకు దిగితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం పోలీసులు, నాయకులు పాల్గొన్నారు.

ధూపాటి సేవలు మరువలేనివి



ధూపాటి సుబ్రమణ్యం దంపతులను సత్కరిస్తున్న బాలల సంరక్షణ సమితి సభ్యులు

రాజంపేట, మే 31 : రాజంపేటకు చెందిన రాయలసీమ బాలల సంరక్షణ రీజనల్ ఇన్స్పెక్టర్ ధూపాటి సుబ్రమణ్యం పదవీ విరమణ సందర్భంగా బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ధూపాటి సుబ్రమణ్యంను, ఆయన సతీమణి సుజాతను భారీ గజమాల శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ శాఖకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ రిటైర్డు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుకుమారన్, సీనియర్ రీజనల్ అధికారులు షణ్ముఖరావు, సుధాకర్, త్రినాథరావు, నందలూరు ఎంఈవో నాగయ్య, కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యులు కొండ వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్ మురళీ, పశువైద్యులు ధూపాటి సుధీష్, పంటి వైద్యులు డాక్టర్ భానుసాయి,స్టేట్ బ్యాంకు మేనేజర్ కిరణ్, నేషనల్ ప్రింటింగ్ ప్రెస్ అధినేత గుగ్గిళ్ళ హరిప్రసాద్, ప్లానర్ రవిశంకర్, ఉపాధ్యాయులు రిటైర్డు షామీర్భాష, హరి, గిరి, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ సునీత తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న ఆర్అండ్బీ రోడ్డు

సుండుపల్లె, మే31: సుండుపల్లె మండల కేంద్రంలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కెనరా బ్యాంకు వద్ద గల ప్రధాన రహదారి చిన్నపాటి వర్షం వస్తే చాలు చెరువును తలపిస్తోంది. ఇళ్లలోని మురుగునీరు రోడ్లపై చేరుతుండడం, వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఒకసారి వర్షం పడితే చాలు పది రోజుల వరకు చెరువును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



విత్తన కాయలు పంపిణీ చేస్తున్న జేడీఏ చంద్రానాయక్

రామాపురం, మే 31: సబ్సిడీ వేరుశనగ కాయలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ కోరారు. మండలంలోని చిట్లూరు, నల్లగుట్టపల్లె రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనం తీసుకున్న ప్రతి రైతు ఉపయోగించుకోవాలన్నారు. కచ్చితంగా పంట నమోదు చేసుకోవాలని, లేకంటే పూర్తి ధర చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది వేరుశనగ విత్తన కాయల నాణ్యత పరిశీలించి, నాణ్యత లేకుంటే జిల్లా అధికారులకు తెలపాలన్నారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని , అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది చంద్రకళ, లక్ష్మిదేవి, రైతులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో ఫార్మసీ ప్రొఫెసర్లు డాక్టర్ లీలామణి, డాక్టర్ స్వర్ణలత తదితరులు

రాజంపేట టౌన్, మే 31 : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ లీలామణి, అసిస్టెంటు ప్రొఫెసర్ ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించా. ఈ సందర్భంగా డాక్టర్ లీలామణి పాముకాటు, వడదెబ్బ, గాయాలు, యాక్సిడెంట్లు జరిగినపుడు ప్రాథమిక చికిత్స చేసే విధానాన్ని వివరించారు. . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత, సి.చిన్నకృష్ణ, వినీల,హాసిని, ఎం.శిరీషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, వైస్చైర్మన్ సి.యల్లారెడ్డి, కోశాధికారి సి.అభిషేక్రెడ్డి, చైర్మన్ డాక్టర్ సి. రామచంద్రారెడ్డిలు శిక్షకులను అభినందించారు.

'కిరణ్కుమార్రెడ్డి విజయం తథ్యం'



శాలువా కప్పి కిరణ్కుమార్రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, మే 31: కిరణ్కుమార్ రెడ్డి మంచి మెజార్టీతో గెలుస్తారని రాజంపేట బీజేపీ నేతలు అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్కుమార్రెడ్డిని వారు కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్నాయుడు మాట్లాడుతూ రాజంపేట లోక్సభా స్థానంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని, ఈ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి మంచి మెజార్టీ వస్తుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కలిసికట్టుగా పని చేయడంతో కనీవిని ఎరుగని విధంగా ప్రజలు ఎన్డీఏ వైపు మొగ్గు చూపారన్నారు. కిరణ్కుమార్రెడ్డి మంచి మెజార్టీతో గెలుస్తారన్నారు. . ఈ కార్యక్రమంలో బీజేపీ రైల్వేకోడూరు కన్వీనర్ గాదెల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.సురేష్రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు, కార్యదర్శి పెనుగొండ రమణ, సీనియర్ నాయకులు వాకచర్ల సుబ్బారావు, యువమోర్చా నాయకులు ముంగి మోహన్, తోట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలవిహార్ సమ్మర్ క్యాంపు



చిన్నారులతో చిన్మయారణ్య ఆశ్రమ నిర్వాహకులు

ఓబులవారిపల్లె,మే 31 : మండల పరిధిలోని యల్లాయపల్లె గ్రామంలోని చిన్మయారణ్య ఆశ్రమ ప్రాంగణంలో 9 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఆశ్రమ నిర్వాహకులు స్వామిని శీలానంద మాతాజీ, శ్రేయానంద మాతాజీలు 'రామ ద సింబల్ ఆఫ్ ధర్మ 'అనే పేరుతో బాల బాలికలకు 9 రోజుల పాటు బాల విహార్ సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా యోగ, సూర్య నమస్కారాలు, వేద పఠనం, భగవద్గీత పారాయణం, రామాయణం ప్రాశస్త్యం , చిత్ర లేఖనం, భజనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశంలో హిందూధర్మ ప్రచార పరిషత్ ధర్మచార్యులు గంగనపల్లె వెంకటరమణ మాట్లాడుతూ ధర్మాన్ని అనుసరించిన వారు శ్రీరాముని మార్గాన్ని అనుసరిస్తారని, తద్వారా రామరాజ్య స్థాపనకు కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు టి.శివరాజ్కుమార్, పి.శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే అండర్పాస్ పూర్తయ్యే వరకు ఉద్యమాలు'



పనులను పరిశీలించిన సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, మే 31: రైల్వే అండర్పాస్ పనులు పూర్తయ్యే వరకు ఉద్యమాలు ఆగవని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్లు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు రైల్వేస్టేషన్కు సమీపంలో రైల్వే అండర్ పాస్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్పాస్ లేకపోవడంతో 25 గ్రామాల ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారన్నారు. రైతులు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, కాలేజి విద్యార్థులు, హాస్టల్ విద్యార్థులురైల్వే గేటు దాటుకుని పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైల్వే గేటు అవతలి భాగంలో కాలేజీలు, హాస్టళ్లు, పల్వరైజింగ్ మిల్లులు ఉన్నాయన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రయాణికులు, ప్రజలు తదితరులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. పనులు వేగవంతం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే తాటతీస్తాం: సీఐ

రైల్వేకోడూరు, మే 31: కౌంటింగ్ రోజున అల్లర్లకు పాల్పడితే తాటతీస్తామని రైల్వేకోడూరు సీఐ టి. బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతి తో మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. . రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద కంచెలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏ పార్టీ వారైనా అల్లర్ల సృష్టిస్తే కఠినంగా చర్యలు ఉంటాయన్నారు. లాఠీ చార్జ్ కూడా చేసే పరిస్థితిని నాయకులు, కార్యకర్తలు తెచ్చుకోవద్దన్నారు. . ఇప్పటికే గ్రామాల్లో 144 సెక్షన్, పోలీసు 30 యాక్టు అమలు చేస్తున్నామన్నారుయ. ప్రజా ఆస్తులకు విఘాతం కల్గించరాదన్నారు. ప్రజలు ఇళ్లలోనే కూర్చుని టీవీ పెట్టుకుని కౌంటింగ్ వివరాలు చూసుకుంటే మంచిదని తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపునకు సర్వే



దివ్యాంగ పిల్లల కోసం ఇంటింటా సర్వే చేస్తున్న రంగస్వామి

నందలూరు, మే 31 : దివ్యాంగ చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధి లక్ష్యంతో వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు మండల సమ్మిళిత ఉపాధ్యాయుడు రంగస్వామి తెలిపారు. శుక్రవారం ఆడపూరులో ఇంటింట సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 మంది బడిలో లేని దివ్యాంగ పిల్లలను గుర్తించామన్నారు. ఈ సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు సహకరించాలని కోరారు. ఉపకార వేతనాలు, చిన్నపాటి శస్త్ర చికిత్సలు, రవాణా, భత్యం కింద 300 రూపాయలు, బాలికలకు ప్రత్యేకంగా 200 రూపాయలు, వినికిడి, దృష్టిలోపం ఉన్న పిల్లలకు ట్యాబులు, స్పీచ్ థెరపీ లాంటి సదుపాయాలన్నీ భవిత కేంద్రాల్లో లభ్యమవుతాయన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

నందలూరు,మే 31 : సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్స్టేషన్లో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టపాసులు పేల్చినా, ర్యాలీలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాల రోజున రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని తెలిపారు. 30 యాక్టు, 144 సెక్షన్ అమల్లో వుంటుందని తెలిపారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్లు పరమేష్, గోపాల్, సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల్లో గజ బీభత్సం




ఉర్లఓబనపల్లె అటవీ ప్రాంతంలో తిరుగాడుతున్న ఏనుగులు, ఏనుగుల దాడికి గోనుగూరులో రాలిన మామిడి కాయలు

కుప్పం, మే 31: తమిళనాడు - ఆంధ్రా సరిహద్దుల్లో రెండు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పంటలను తొక్కి, తిని ధ్వంసం చేశాయి. తమిళనాడు నుంచి వచ్చిన రెండు ఏనుగులు కొద్ది రోజులుగా రామకుప్పం మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో సంచరించాయి. గురువారం రాత్రి కుప్పం మండలంలోకి ప్రవేశించాయి. శుక్రవారం తెల్లవారుజామున వసనాడు, నడిమూరు, గోనుగూరు, ఉర్లఓబనపల్లె తదితర గ్రామాల్లోని పంట పొలాలపై పడ్డాయి. వసనాడులో కోతకు వచ్చిన శాంతారాం టమోటా తోటను తొక్కి ఎందుకూ పనికిరాకుండా నాశనం చేశాయి. మామిడి తోటలపై పడి కొమ్మలను విరిచి, కాయలను రాల్చి రైతులకు అపార నష్టం మిగిల్చాయి. ఈసారి మామిడి దిగుబడి అసలే అంతంత మాత్రంగా ఉంది. అడపాదడపా గాలీవాన వచ్చి చాలా కాయలు రాలుతున్నాయి. గురువారం రాత్రి కొద్దిసేపు భారీగా కురిసిన వర్షానికి కాయలు రాలిపోయాయి. చెట్లపై మిగిలిన కాయలను ఈ రెండు ఏనుగులు రాల్చేసి రైతులకు అప్పులు మిగిల్చాయి. ఇక, కుప్పం డీఆర్వో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఉదయంనుంచి తమిళనాడు సరిహద్దులకు ఆవలకు ఏనుగులను మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. సాయంత్రానికి రెండు ఏనుగులు ఉర్లఓబనపల్లె అటవీ ప్రాంతంలోకి చేరాయి.

ఇక్కడ అటవీ సిబ్బంది మళ్లింపు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ రాత్రికి తమిళనాడువైపు మళ్లే అవకాశం ఉంది. అయితే, ఏ క్షణమైనా ఈ ఏనుగులు తిరిగి వచ్చి కుప్పం నియోజకవర్గంలోని సరిహద్దు గ్రామాలపై దాడులు చేయవచ్చని, అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఏనుగులను తరిమేందుకు తమ ప్రయత్నాలు తాము చేస్తున్నామన్నారు. రాత్రివేళ రైతులు పంటపొలాల దగ్గరకు ఒంటరిగా వెళ్లొద్దని, అది ప్రాణాలకు సైతం ముప్పు తెచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



వసనాడులో ధ్వంసమైన టమోటా పంట

కల్లూరు సమీపంలో ఒంటరి ఏనుగు హల్‌చల్



మామిడిచెట్లను విరిచేసిన ఏనుగు

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. కల్లూరుకు చెందిన రైతు షౌకత్ ఆలీ మామిడితోటలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగు 12 చెట్లను విరిచేసింది. మామిడి కాయలను నేలరాల్చింది. నీటి పైపులను ధ్వంసం చేసింది. అనంతరం సమీప అడవిలోకి వెళ్లింది. ఏనుగుల గుంపు నుంచి ఒక ఏనుగు విడిపోయిందని, పాకాల మండలం పదిపుట్లబైలు, పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలో తిరుగుతోందని రైతులు తెలిపారు.

సోమల సమీపంలో 16 ఏనుగుల గుంపు



ఏనుగులు ధ్వంసం చేసిన కంచె

సోమల: సోమల పంచాయతీ గుంతచెరువుపల్లె సమీపంలో గురువారం రాత్రి 16ఏనుగుల గుంపు సంచరించాయి. ఆ గ్రామానికి చెందిన చెల్లె శంకరయ్య, రామూర్తి పొలాల్లో పంటలను తొక్కేశాయి. శంకరయ్య మామిడి తోటలో కంచెగా వేసిన రాతి కూసాలను విరిచి తోటలో ప్రవేశించాయి. వీరి పొలాల వద్ద 13కేవీ విద్యుత్ లైన్లు తక్కువఎత్తులో ఉన్నాయి. ఏనుగులు ఆ మార్గంలో వెళ్లి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది. అధికారులు స్పందించి విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్ నుంచి వరుస క్రమంలో ఈవీఎంలు పంపాలి



కౌంటింగ్ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 31: జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు స్ట్రాంగ్ రూముల నుంచి కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లతోసహా ఈవీఎంలను వరుస క్రమంలో కౌంటింగ్ కేంద్రాల్లోకి తరలించాలని చిత్తూరు ఆర్వో, జేసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన సమావేశపు మందిరంలో ఓట్ల లెక్కింపునకు నియమితులైన అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను సీలింగ్ రాములలో భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో సంబంధిత అధికారుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 3 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చిన్న పొరబాట్లకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, గుడిపాల తహసీల్దార్లు శ్రీనివాసులురెడ్డి, షేక్ హసీనాబీ, విజయలక్ష్మి, డీటీలు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున ట్రాఫిక్ ఆంక్షలు

చిత్తూరు, మే 31: ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కారణంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాదుకు వెళ్లాల్సిన వారు ఇరువారం వైపుగా, వరిగపల్లె జంక్షన్ మీదుగా సిక్స్‌లేన్ హైవేపై వెళ్లాలని తెలిపారు. చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి వరిగిపల్లె(కాఫీడే)జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి సిక్స్‌లేన్ హైవేలో వెళ్లాలని సూచించారు. తిరుత్తణి నుంచి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన వారు తానా జంక్షన్ నుంచి జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకోవాలన్నారు. కడప-పీలేరు-తిరుపతి నుంచి చిత్తూరుకు రావాలనుకున్న వారు రంగంపేట సిక్స్‌లేన్ హైవేపై వరిగపల్లె జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వావిల్‌తోట-బండపల్లె-పూతలపట్టు మండలం, సమీప గ్రామాల ప్రజలు చిత్తూరుకు వరిగపల్లె మీదుగా రావాలని కోరారు. తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేవారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. రంగంపేట ఫ్లైఓవర్ క్రాస్ నుంచి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులను మాత్రమే ఎస్పీసెట్ వరకు అనుమతిస్తారని తెలిపారు. రెండవ గేట్ ద్వారా ఆర్వీఎస్ ఆస్పత్రి వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్‌కు స్థలం కేటాయించామని చెప్పారు. ఏజెంట్లు, పోలీసులు, మీడియా వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పూతలపట్టు నుంచి వచ్చే వాహనాలు ఎడమ వైపు సర్వీసు రోడ్డులో అండర్‌పాస్ ద్వారా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చని వివరించారు. మురకంబట్టు నుంచి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఆర్వీఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి వైపు రహదారి నుంచి మహర్షి పాఠశాల పార్కింగ్ వద్దకు వెళ్లవచ్చు.

జూకు కొత్తగా రెండు తోడేళ్లు




మంగళం, మే 31: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు తోడేళ్లు తెప్పించారు. యానిమల్ ఎక్స్ఛేంజ్ స్కీమ్‌లో భాగంగా బెంగళూరులోని బన్నారగుట్ట జూపార్కు నుంచి ఒక ఆడ, ఒక మగ తోడేళ్లను తిరుపతికి తీసుకొచ్చారు. అలాగే ఇక్కడినుంచి రెండు హైనాలను బెంగళూరు జూకు పంపారు. తీసుకొచ్చిన రెండు తోడేళ్లను 45రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి అనంతరం సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్‌లో వదలనున్నారు. ఇటీవల జూకు తీసుకొచ్చిన నీటి ఏనుగులు.. సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తాం

జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ గోవా, హైదరాబాదు, చెన్నై జూలనుంచి త్వరలోనే మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తామన్నారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఫీడ్ వెహికల్, జంతువులకు మత్తు ఇచ్చేందుకు ఉపయోగించే గన్ను, సందర్శకుల కోసం ఆర్వో ప్లాంట్‌ను తదితరాలను రూ.19.4లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొత్తిమీర కట్ట రూ.వంద



సదుం సంతలో అమ్మకానికి నిల్వ చేసిన కొత్తిమీర

సదుం, మే31: కొత్తిమీర కట్ట ధర కొండెక్కింది. శుక్రవారం సదుం వారపుసంతలో కొత్తిమీర కట్ట ధర. రూ100 పలకడంతో కొనుగోలుదారులు నివ్వెరపోయారు. గతంలో ఎన్నడూ ఇంత ధరలేదని స్థానికులు అంటున్నారు.

తిరుపతి టాస్క్‌ఫోర్సు ఆఫీస్ వద్ద అగ్నిప్రమాదం



మంగళం, మే 31: తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీనిని గమనించిన టాస్క్‌ఫోర్సు సిబ్బంది, ఉన్నతాధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారా లేక సాధారణంగానే మంటలు చెలరేగాయా అనే దానిపై విచారణలో తేలాల్సి ఉందని అధికారులు చెప్పారు.

రుయాలో కానరాని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు

రోగుల సహాయకులకు తిప్పలు




రోగులను చేతులపై ఒకరు, వీల్‌చైర్‌పై మరొకరు తీసుకువెళుతున్న సహాయకులు, స్ట్రెచర్‌పై రోగిని తీసుకెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), మే 31: అంబులెన్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వైద్యం కోసం అత్యవసర విభాగానికి వచ్చే రోగులను తక్షణమే వాహనాల్లో నుంచి దింపుకొని వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్‌లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సిన ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు డీఈవోలుగా, ఓటీ సహాయకులుగా స్థిరపడిపోవడంతో అందుబాటులో సిబ్బంది లేక రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్న దుస్థితి రుయాస్పత్రిలో నెలకొంది. రుయాలో రోగులకు సేవలందించేందుకు సాధారణంగా 145మంది ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు ఉండాలి. కానీ 67 మంది మాత్రమే ఉండగా, మిగిలిన 78పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 67మందిలో రోజూ 20మందికిపైగా సెలవుల్లో ఉండటం, మరో 10మందిని డీఈవో, ఓటీ సహాయకులుగా సర్దుబాటు చేయడంతో కేవలం 37మంది విధుల్లో ఉంటున్నారు. వీరు 3వేలమందికి పైగా రోగులకు సేవలు అందించాల్సి వస్తోంది. రోగులను వారి సహాయకులే చేతులపై లేదా వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్‌లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సి వస్తుంది. దీంతో రోగులకు అత్యవసర వైద్యం అందడం ఆలస్యమవడంతోపాటు రోగుల సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్న అరాకొరా ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు కూడా రోగికి సాయం చేయాలంటే చేయి తడపనిదే ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి రోగులకు అందుబాటులో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

వెటర్నరీ వర్శిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొఫెసర్ శ్రీలత

తిరుపతి రూరల్, మే 31: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్శిటీ తాత్కాలిక డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొద్దుటూరులోని వెటర్నరీ సైన్స్ కళాశాల పాథాలజీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతని నియమిస్తూ వర్శిటీ వీసీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీఆర్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో.. శ్రీలతని తాత్కాలిక డీఆర్‌గా నియమించారు. దాంతో శ్రీలత ఆ బాధ్యత చేపట్టారు. కాగా ప్రభుత్వం పెంచిన 65 సంవత్సరాల సర్వీసుకు హైకోర్టు ఇంటీరియమ్ ఆర్డర్‌తో సర్జన్‌రావుని ప్రొఫెసర్‌గా కొనసాగిస్తూ వర్శిటీ రిజిస్ట్రార్ అరుణాచలం రవి ఉత్తర్వులు వెలువరించారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ప్రొఫెసర్ శ్రీలత నియామకంపై ఏపీ ఎన్నికల కమిషన్ అధికారి (సీఈవో) అనుమతి తీసుకున్నారా అన్న అంశంపై రిజిస్ట్రార్‌ని వివరణ కోరగా.. 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, వర్శిటీ పాలకమండలిలో పెట్టి రాటిఫికేషన్ తీసుకుంటామని వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 64,115 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,711 మంది తలనీలాలు సమర్పించారు.

రెండవ ఘాట్‌లో అదుపుతప్పి జీపు బోల్తా



తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌లో శుక్రవారం ఓ జీపు బోల్తాపడింది. ఏపీ 03 వీ 7155 నెంబరు గల జీపులో ఆరుగురు భక్తులు శుక్రవారం మధ్యాహ్నం తిరుమలకు బయలుదేరారు. మార్గంలోని 7వ కిలోమీటరు మలుపు వద్ద జీపు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు జీపులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతరం టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

రేపు తుమ్మలగుంటలో క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి రూరల్, మే31: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడామైదానంలో చిత్తూరు జిల్లా బాలుర, బాలికల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23(పురుషులు), అండర్-16(బాలురు) విభాగంలో ఈనెల 2న క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 9849026131, 7981880381 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హుండీ కానుకలు తస్కరించిన అప్రైజరు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్, ఉంగరం, నగదు

ఐరాల(కాణిపాకం), మే 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ లెక్కింపులో చేతివాటం చూపిన అప్రైజర్ ప్రకాష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు చిత్తూరు వెస్టు సీఐ రవిశంకర్ రెడ్డి, కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. గురువారం హుండీ కానుకల లెక్కింపు సందర్భంగా వంద గ్రాముల బంగారు బిస్కెట్, ఒకటిన్నర గ్రాముల ఉంగరం, రూ.ఐదు వందలను అప్రైజరు తస్కరించినట్లు వారు చెప్పారు. ఆలయ ఏఈవో హరిమాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

పాఠశాలలను సిద్ధం చేసుకోండి : డీవైఈవో

చిత్తూరు (సెంట్రల్), మే 31: ప్రభుత్వ పాఠశాలలను జూన్ 12 నుంచి పునఃప్రారంభించడానికి సిద్ధం చేసుకోవాలని డీవైఈవో చంద్రశేఖర్ సూచించారు. పాఠశాల సంసిద్ధతపై శనివారం ఆయన డీఈవో కార్యాలయంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. జూన్ 3న హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకుని శుభ్రం చేసుకోవాలన్నారు. 5వ తేదీ నుంచి పాఠశాల పరిధిలో పర్యావరణ వారోత్సవాలు నిర్వహించాలని, అదే సమయంలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. పాఠశాలల్లోని మైక్ సెట్‌లను ఈనెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. ఎంఈవో సెల్వరాజ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై వేటుకు కారణం ఆయన స్నేహితుడి అధీనంలో అధికారిక వాహనం

తిరుపతి (నేరవిభాగం), మే 31: చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై బదిలీ వేటు పోలీసువర్గాల్లో చర్చగా మారింది. మూడు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నుంచి చంద్రగిరి డీఎస్పీగా వచ్చిన శరత్‌రాజ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలున్నాయి. చంద్రగిరికి ఎన్నికల కమిషన్ ఆయన్ను నోడల్ అధికారిగా నియమించింది. రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోవడం వెనుక పోలీసు అలసత్వానికి ఆయనే బాధ్యుడని భావిస్తున్నారు. కూచువారిపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలపై వైసీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరచినా నిందితులపై కేసులు నమోదు చేయడంలో డీఎస్పీ పూర్తిగా విఫలమయ్యారు. తాము కూచివారిపల్లెని సందర్శించిన తర్వాతే కేసులు నమోదు చేయడాన్ని సిట్ బృందం తప్పు పట్టింది. కొటాల చంద్రశేఖర రెడ్డి ఇల్లును తగులపెట్టినా ఆ తర్వాత అప్రమత్తం కావాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. తొలి నుంచి ఆయన వైసీపీకి వీర విధేయుడిగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా వుండగా డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని ఆయన స్నేహితుడు, కడపకు చెందిన సుదర్శన్ వాడుతున్నట్టు కూడా అధికారుల దృష్టికి వచ్చింది. నర్సింగ్ కాలేజీ యజమాని అయిన ఆయన పోలీసు స్టిక్కరున్న వాహనాన్ని దర్జాగా వాడుకునేవారన్న ఆరోపణలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం పోలీసు కారులో సుదర్శన్ మహిళా వర్శిటీ స్ట్రాంగ్ రూము లోపలకు వెళ్లడానికి ప్రయత్నించాడని అంటున్నారు. డీఎస్పీ వర్శిటీ లోపల విధుల్లో వుంటే ఆయన కారులో ఎవరు వస్తున్నారు అనే అనుమానంతో అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించారని తెలిసింది. వారిని ద బాయించిన అయన కారును నేరు గా స్ట్రాంగ్‌రూము వద్దకు తీసుకెళ్లారని అంటున్నారు. దీనిపై ఎస్బీ పోలీసులు ఎస్పీకి సమాచారం అం దించారు. డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎస్పీ రిపోర్టు పంపడం తో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయనపై వేటు వేయడానికి ప్రధాన కారణం శాంతి భద్రతల పరిరక్షణకు కేటాయించిన కారును దుర్వినియోగం చేయడం. శాంతి భద్రలను గాలికి వదిలేయడం అని అంటున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా నియమించారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, కూచివారిపల్లె, బ్రాహ్మణకాలువ, రామిరెడ్డిపల్లె ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.

ఎస్వీయూ డిగ్రీ, పీజీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 31: ఎస్వీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి జూలై 2 వరకు జరుగుతాయి. అదేవిధంగా పీజీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ విడుదలైంది. సంబంధిత వివరాలకోసం ఆయా ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సీఈ దామ్లా నాయక్ పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



తంబళ్లపల్లెలో కవాతు నిర్వహిస్తున్న కేంద్రబలగాలు

తంబళ్లపల్లె, మే 31: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు 4వ తేదీ జరుగనున్న సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ మధు హెచ్చరించారు. స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు తంబళ్లపల్లె పురవీధుల్లో శుక్రవారం కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండలంలో 144 సెక్షన్, పోలీసు 30యాక్టు అమలులో ఉంటుందన్నారు. జనాలు అల్లర్లు చేయడం, రోడ్లపై గుంపులు గుంపులుగా గుమికూడడం, రాజకీయపరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటివి చేయరాదన్నారు. కౌంటింగ్ రోజు కానీ, ముగిసిన తర్వాత కానీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు, వారికి సంబంధించిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు చేయరాదన్నారు. ప్రజలు ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణం ఏర్పాటుకు సహకరించాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

పోలీస్ నిబంధనలను పాటించాలి : సీఐ

గుర్రంకొండ, మే 31: ఎన్నికల ఫలితాల దృష్ట్యా అన్ని పార్టీల నేతలు పోలీసుల నిబంధనలను పాటించాలని వాల్మీకీపురం సీఐ పులిశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తరుణంలో రాజకీయ నేతలు అందరూ ర్యాలీ, సంబరాలు, టపాకాయలు కాల్చరాదన్నారు. ఎవరైనా పోలీస్ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల రోజున అన్ని గ్రామాల్లో పోలీసులు పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

● పట్టపగలే యథేచ్ఛగా అక్రమ రవాణా

బి.కొత్తకోట, మే31: మండలంలో మట్టిమాఫి యా రెచ్చిపోతోంది. అక్ర మ లేఅవుట్, వెంచర్ల కో సం ఇష్టారాజ్యంగా ఎక్క డ పడితే అక్కడ మట్టిని తవ్వేసి తరలిస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో తలమునకలై వుండడం, ఉన్న అధికారులు పట్టించుకోకపోవడంతో ఇదే అదనుగా అక్రమ తవ్వకాలు భారీగా సాగుతున్నాయి. పట్టణ చుట్టుపక్కల గుట్టలను, డీకేటీ భూములను దాదాపు ఖాళీ చేసేశారు. తాజాగా పట్టణంలో ప్రధాన రహదారికి అనుకుని వున్న పెద్దచెరువులో ఎక్స్‌కవేటర్లు పెట్టి, టాక్టర్లకు నింపి వందల లోడ్లు తరలించేస్తున్నా పట్టించుకునే నాథులు లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. టన్నుల కొద్దీ మట్టిని అమ్ముకుని జేబులు నింపుకొంటున్న దళారులు, అక్రమార్కులపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవా లని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మాసాబీబీ దర్గా గంధం ఉత్సవం



ఉరుసు ఉత్సవాల్లో కడప పెద్దదర్గా గురువు తదితరులు

పెద్దమండ్యం, మే 31: పెద్దమండ్యం కుషావతినది తీరంలో వెలసిన హజరత్ మహబూబ్ సుబహాని, హజరత్ మాసాబీబీ దర్గా గంధం ఉత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గాలో కడప దర్గా గురువుల ఆరీఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో చదివింపులు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దర్గా ప్రాంతం, పురవీధులు ఆకర్షణీయంగా విద్యుత్తు దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పెద్దమండ్యంలో మాసామ్మదర్గా ఉరుసు ఉత్సవాలు కులమతాలకు అతీతంగా జరుతున్నాయి. శుక్రవారం ఖవాలీ(పాటకచ్చేరి) కార్యక్రమాలు జరిగాయి. కలిచెర్ల సింగిల్ విండో చైర్మన్ కడప సుధాకర్‌రెడ్డి, అభినయకుమార్‌రెడ్డి, సర్పంచ్ బాషా, దర్గా కమీటీ సభ్యులు, కర్ణాటక సహా సత్యసాయి, చిత్తూరు, కడప జిల్లాల భక్తులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే స్కూల్‌బస్సులు సీజ్ : ఎంవీఐ

మదనపల్లె టౌన్, మే 31: స్కూల్‌బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే సీజ్ చేస్తామని మదనపల్లె ఎంవీఐ దినేష్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రవాణాశాఖ కార్యాలయం వద్ద పలు స్కూల్‌బస్సుల సామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు. స్కూలు బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు వుంచాలని, అత్యవసర తలుపు, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, అనుభవం గల డ్రైవర్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తప్పక వుండాలన్నారు. చిన్నపిల్లలు ఎక్కే బస్సు మెట్లు వారి కాళ్లకు అందేంత ఎత్తులో వుండాలన్నారు. బస్సు ఫిట్‌నెస్ అవసరమైన అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేస్తేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీచేస్తున్నామన్నారు. మదనపల్లె ఆర్‌టీఓ పరిధిలో 270 స్కూలు బస్సులు వుండగా ఇప్పటి వరకు 200 బస్సులు ఫిట్‌నెస్ చేసుకున్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 18 ఏళ్లు నిండని మైనర్లు ద్విచక్ర, నాలుగుచక్రాల వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు రూ.25వేలు జరిమానా వేయడం, కేసులు కూడా నమోదు చేస్తామన్నారు.

లెక్కింపుపై అవగాహన పెంచుకోవాలి

మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ● ప్రతి నియోజకవర్గానికీ ఒక కేంద్ర సర్వీసు అబ్జర్వర్

● మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో 14 టేబుళ్లు



ఓట్ల లెక్కింపుపై వివరిస్తున్న ఆర్ఓ హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మే 31: ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలని రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కౌంటింగ్ ప్రక్రియపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆర్ఓ మాట్లాడుతూ కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్ల వుంటాయని, తొలుత పోస్టల్ బ్యాలెట్‌లు లెక్కిస్తారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిర్దేశకాలతో పోస్టల్ బ్యాలెట్లను లెక్కి స్తారన్నారు. అనంతరం తొలి రౌండ్‌లో 14 టేబుళ్లలో ఈవీఎంకు అనుసంధానించిన కంట్రోల్ యూనిట్‌లో పోలైన ఓట్లు లెక్కిస్తారన్నారు. ప్రతి నియోజకవర్గానికి కేంద్ర సర్వీసు నుంచి ఒక అబ్జర్వర్ వస్తారని, ప్రతి రౌండ్‌లో వారికి డౌట్ వచ్చిన రెండు టేబుళ్లలో లెక్కించిన ఓట్ల ను మళ్లీ మైక్రో అబ్జర్వర్ సమక్షంలో లెక్కిస్తార న్నారు. ఓట్ల లెక్కింపులో తేడాలొస్తే కౌంటింగ్ అధికారులను బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేస్తారన్నారు. ప్రతి రౌండ్‌లోనూ లెక్క తేలాక కౌంటింగ్ ఏజెంట్లు సంతకం పెట్టాలన్నారు. ప్రతిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ రౌండ్ రౌండ్‌కు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా, వైసీపీ అభ్యర్థి నిస్సార్ అహ్మద్, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో 14 టేబుళ్లు - 17 రౌండ్లు

ములకలచెరువు, మే 31: ఎన్నికల కౌంటింగ్ గడువు సమీపిస్తుండడంతో గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. 13వ తేదీన జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 2,24,802 ఓట్లకు 1,86,798 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 236 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొత్తం 14 టేబుళ్లను ఏర్పాటు చేయనుండగా 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలకంటే తక్కువగా పోలింగ్ కేంద్రాలు ఉండడంతో మొదటి ఫలితం తంబళ్లపల్లె వచ్చే అవకాశం ఉంది. తొలుత ములకలచెరువు మండలం గూడుపల్లె పోలింగ్ కేంద్రం ఓట్లు లెక్కించనుండగా చివరగా కురబ లకోట మండలం అంగళ్లు ఓట్లను లెక్కిస్తారు. మొదట ములకలచెరువు, తరువాత తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, చివరగా కురబలకోట మండల ఓట్లను లెక్కించిన తరువాత కౌంటింగ్ పూర్తవుతుంది.

పొగాకు వాడకాన్ని నిషేధించాలి

● ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో మెడికల్ ఆఫీసర్ కిరణ్

● బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లెల్లో అవగాహన సదస్సులు





బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ కిరణ్
వాల్మీకిపురం ఆస్పత్రిలో పొగాకు నివారణపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ ఫైరోజాబేగం

బి.కొత్తకోట, మే31: పొగాకు వినియోగానికి అందరూ దూరంగా వుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బి.కొత్తకోట సీహెచ్‌సీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ పేర్కొన్నారు. శక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరో వైద్యాధికారి హసీనాపర్వీన్ మాట్లాడుతూ పొగాకును ఏ రూపంలో తీసుకున్నా శరీర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మన రీడిసీజ్, క్షయ లాంటి ప్రమాదకర ప్రసరణ వ్యాధులు సోకుతాయన్నారు. మెదడులో రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడుతుందని, గొంతుక్యాన్సర్, గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. తాగే వారికి మాత్రమే కాకుండా పీల్చేవారికి కూడా ప్రమాదమని ప్రతి ఒక్కరూ పొగాకు ప్రమాదంపై అప్రమత్తంగా వుండాలని కోరారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నవారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ప్రాణాంతకం

వాల్మీకిపురం, మే 31: పొగాకు వినియోగం ప్రాణాంతకమని వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాల్మీకిపురం మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొగాకు కారణంగా కలిగే నష్టాలు, ప్రాణాపాయం తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి పొగాకుతో జరిగే నష్టాలను ప్రజలకు తెలియ జేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ వాల్మీకిపురంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డాక్టర్లు రవికుమార్, హర్షితారెడ్డి, శివాణి, హిమబిందు, సూపర్‌వైజర్ సుధాకర్, హెల్త్‌ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, టీబీ యూనిట్ అధికారి నాగిరెడ్డి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం

మదనపల్లె టౌన్, మే 31: పొగాకు తిన్నా, ధూమపానం చేసినా ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వ బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పతి నుంచి పట్టణంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ ధూమపానం చేసే వారి చుట్టుపక్కల వున్న వారికి కూడా ఈ పొగతో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి పొగాకు పదార్థాల వినియోగం నిలిపివేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రసాదరాజు, రాధిక, విష్ణువర్ధన్, జ్యోత్స్న, భారతి, సురేష్, ఈశ్వర్, అలేఖ్య, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్యపోరుతోనే శేషాద్రి హత్య

ఏడుగురు నిందితుల అరెస్టు ● మరో ఇద్దరిపై కేసు నమోదు : డీఎస్పీ



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రసాద్ రెడ్డి

మదనపల్లె అర్బన్, మే 31: పట్టణంలో రెండు ప్రజాసంఘాల నేతల మధ్య ఆధిపత్య పోరుతోనే శేషాద్రి హత్య జరిగిందని మదనపల్లె డీఎస్పీ ప్రసాదరెడ్డి వెల్లడించారు. శుక్రవారం టుటౌన్‌లో విలేకర్ల సమావేశంలో శేషాద్రి హత్యకేసులో ఏడుగురు నిందితుల అరెస్టు చూపిన డీఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 25న శ్రీవారినగర్ శివార్లలోని మంజునాదకాలనీ వద్ద పుంగనూరు శేషాద్రి హత్య జరిగిందన్నారు. ఈ కేసులో నలుగురు సీఐలను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి హత్యకేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రజాసంఘాల నేతల మధ్య భూ దందాలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లపై వివాదాలే ఈ హత్యకు కారణమన్నారు. ఇందులో భాగంగా విచ్చలవిడిగా దాడులకు పాల్పడడం, దౌర్జన్యాలు చేయడం, కుల సంఘాలను అడ్డుపెట్టుకుని ప్రజలను వేధింపులకు గురిచేయడం, అట్రాసిటీ కేసులు పెడుతూ ప్రజలు, పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుందన్నారు. ఇదే రీతిలో రామారావుకాలనీకి చెందిన కొండుపల్లె ఆనంద్ ప్రజాసంఘంలో శేషాద్రి గతంలో అనుచరుడుగా ఉండేవాడన్నారు. ఇటీవల ఇరువురి మధ్య ఆధిపత్య పోరు చెలరేగడంతో విడిపోయారు. శేషాద్రి బహుజన భీమసేన పేరిట ఓ సంఘాన్ని పెట్టుకుని భూదందాలు, సెటిల్మెంట్లు చేసే వాడు. దందాల విషయమై పోటీ పడ్డారు. ఇటీవల రామారావుకాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం, కొండుపల్లె ఆనంద్‌కు అసూయ, ఈర్ష్య పెరిగి ఎలాగైనా శేషాద్రిని మట్టుపెట్టాలని పథకం వేశారు. ఈప్రకారమే తన అనుచరులను కూడగట్టుకుని పుంగనూరు శేషాద్రిని ప్రత్యర్థులు ఈ నెల 25న అతి దారుణంగా కత్తులు, వేటకొడవళ్లతో హత్య చేసిన సంఘటన తెలిసిందే. కేసు నమోదు చేసిన మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, టూటౌన్ సీఐ యువరాజు, వన్‌టౌన్ సీఐ వల్లీబసు, తాలుకా సీఐ శేఖర్, రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, టూటౌన్ ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య, ఇనాయతుల్లా కేసును లోతుగా దర్యాప్తు చేపట్టి పక్కా సమాచారంతో కొండుపల్లె ఆనంద్(గొల్లపల్లె), తుపాకుల మణికంఠ, బండి మహేష్(విజయనగర్ కాలనీ), శివాజీ నగర్ చీకిలగుట్టకు చెందిన సాతిపడి రాజశేఖర్, రామారావుకాలనీకి చెందిన మొరుంపల్లె చరణ్ కుమార్, ముసలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ చెన్నారెడ్డి, గౌతమీ నగర్‌కు చెందిన పఠాన్ నజీర్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. దీంతో పాటు హత్యకు వినియోగించిన ఇన్నోవా కారును సమకూర్చిన రుద్ర, హరిపై కూడా కేసు నమోదు చేశారు. హత్యకు ఉపయో గించిన కత్తులు, సమ్మెట, కారు, ఆటో, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు సీజ్‌చేశారు. కార్యక్రమంలో క్రైమ్ పార్టీ, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ నారాయణస్వామికి ఘన సన్మానం

రామసముద్రం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓ నారాయణ స్వామిని సహచరులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మండల సహచర ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు ఆయనకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తాను 35ఏళ్లగా ప్రజలకు సేవలు అందించే అవకాశం లభించడం హర్షణీయమన్నారు. వృత్తి పరంగా అనేక అవార్డులు, సన్మానాలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. మండల నేతలు, ప్రజలకు, సహచర ఉద్యోగులకు, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఎం శంకరయ్యకు సన్మానం

కలకడ, మే 31: ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఆదర్శ గురువు శంకరయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. నడిమిచెర్ల హైస్కూల్ హెచ్ ఎంగా పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ఆయనను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సంఘం మదనపల్లె డివిజన్ కార్యదర్శి చెంగల్‌రాయులు మాట్లాడుతూ సన్మాగ్రహీత తన 41 ఏళ్ల సర్వీస్‌లో పని చేసిన ప్రతి పాఠశాల్లో మంచి గుర్తింపు పొందినట్లు తెలిపారు.

సమకాలీన సమస్యలు, పరిష్కారాలపై దృష్టి పెట్టాలి

● డీఆర్‌డీఓ జాయింట్ డైరెక్టర్

మదనపల్లె టౌన్, మే 31: ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రస్తుత సమకాలీన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టాలని డీఆర్‌డీఓ జాయింట్‌డైరెక్టర్ టి.రామ్‌ప్రభు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సమకాలీన సమస్యలపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీలో కొత్త సమస్యలు వస్తుంటాయని వాటిని చాలెంజింగ్‌గా తీసుకుని పరిష్కార మార్గాలను ఎప్పటికప్పుడు కొనుగొంటూ ఇంజనీరింగ్ విద్యార్థులు ముందుకు నడవాలన్నారు. డైరెక్టర్ రామలింగారెడ్డి, కరెస్పాండెంట్ రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

మదనపల్లె అర్బన్, మే31: గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. బి.కొత్తకోట పాయింట్‌లో లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి రెడ్డిప్రసాద్(బి.కొత్తకోట), రెండో బహుమతి వి.రమణప్ప(దేవలచెరువు) మూడో బహుమతి ఆర్ గురుప్రకాష్ (మదనపల్లె)కు అందజేశారు. జూన్ 28న మదనపల్లె-తంబళ్లపల్లె రూట్‌లో లక్కీ డిప్పు నిర్వహిస్తున్నట్లు డీఎం తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తాము కొనుగోలు చేసిన టిక్కెటుపై పేరు, ఊరుపేరు, మొబైల్‌నెంబరు రాసి బస్సులోని గిఫ్ట్‌బాక్సులో వేయాలని సూచించారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ములకలచెరువు, మే 31: బురకాయలకోటలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ధ్వజ ప్రతిష్ఠా సంప్రోక్షణ, మహా కుంభాభిషేక సాలికట్టు బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులు జరిగే బ్రహ్మోత్సవాల్లో శనివారం ధ్వజ ప్రతిష్ఠ, సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం, అంకురార్పణ, ధ్వజారోహణ, సహస్రనామ పారాయణం, ప్రాకారోత్సవం, ఆదివారం సుప్రభాతసేవ, మూలమంత్రంతో హోమాలు, నారాయణ హోమము, సహస్రనామార్చన హోమాలు, స్వామి వారి కల్యాణోత్సవం, రాత్రికి స్వామి వారి ఊరేగింపు, సోమవారం పూర్ణాహుతి, అన్నదానం, రథోత్సవం ఊంజల్‌సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జడ్పీ హైస్కూల్ కళాశాలగా మార్పు



జూనియర్ కళాశాలగా మారిన జడ్పీ హైస్కూల్

మదనపల్లె అర్బన్, మే 31: స్థానిక జడ్పీ హైస్కూల్‌ను ఈ ఏడాది నుంచి జూనియర్ ఇంటర్ కో- ఎడ్యుకేషన్ కాలేజీ గా మారుస్తున్నట్లు హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి తెలిపారు. జూన్ 1 నుంచి ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ప్రారభమవుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇప్పటికే పట్టణంలో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహించామని దీని ఫలితంగా ఒక్కో గ్రూపునకు 20 అడ్మిషన్లు వచ్చినట్లు చెప్పారు. ఒక్కో గ్రూపులో 40సీట్లు ఉంటాయని తెలిపారు, కళాశాలలో ల్యాబ్, ఆటస్థలం, డిజిటల్ విద్యాబోధన, లైబ్రరీ, క్లాసు రూమ్స్ ఉన్నాయని తెలిపారు. టెన్త్ పాస్‌అయిన విద్యార్థులు ఉచితంగా అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే 31: సుండుపల్లె మండలం, చప్పిడివాండ్లపల్లె వాసి రేవతిని కట్నం కోసం వేధిస్తున్నారని అత్త, మామ, భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. టూటౌన్ ఎస్ఐ షేక్ ఇనయతుల్లా అందించిన వివరాల్లోకెళితే... స్థానిక ప్రశాంతనగర్ వాసి ఆనందనాయుడు కుమార్తె రేవతికి సుండుపల్లె మండలం, చప్పిడివాండ్లపల్లె వాసి రమేష్‌తో వివాహమైంది. 14 ఏళ్ల కిందట ఆర్మీలో సైనికుడిగా పనిచేస్తున్న రమేష్‌కు పెళ్లికట్నంగా 300 గ్రాముల బంగారం, రెండులక్షలు నగదు ఇచ్చారు. ప్రస్తుతం ఇళ్లు కట్టుకోవడానికి అదనంగా రూ. 20 లక్షలు కట్నం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అత్త లక్ష్మీదేవి, మామ చంద్రయ్య, భర్త రమేష్ కలిసి హింసకు గురిచేస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. టూటౌన్ ఎస్ఐ వరకట్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైబర్ ఉచ్చులో మదనపల్లె యువకుడు

మదనపల్లె అర్బన్, మే 31: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మదనపల్లె యువకుడు బద్రీనాథ్ పడ్డాడు. ఇతను కరెడ్ యాప్ నుంచి రూ. 1,29,495లో సైబర్‌నేరగాళ్లు కొట్టేశారు. ఇదే యాప్ నుంచి రూ. 70 వేలు రికవరీ చేశాడు. మిగిలిన డబ్బు రికవరీ కాకపోవడంతో సైబర్ నేరగాళ్లపై శుక్రవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారుసైబర్ క్రైమ్ ద్వారా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కలికిరి, మే 31: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. వ్యవసాయం, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని కలికిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేష్ తెలిపారు. రెండు లేక మూడేళ్ల డిప్లొమా కోర్సులకు ఈ విద్యా సంవత్సరంలో టెన్త్ ఉత్తీర్ణులైన వారంతా అర్హులేనని తెలిపారు. జూన్ 1 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తులను ఎన్జీ రంగా వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా పంపుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్, అడ్మిషన్ బ్రోచర్, కౌన్సెలింగ్ తేదీల వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం 80081 04977, 90005 23420, 80085 54448 సంప్రదించాలని కోరారు.

బోధనాస్పత్రికి మంచాలు, పడకలు, ఫర్నీచర్లు



కుర్చీలు, టేబుళ్లను లెక్కవేస్తున్న డీఈ కరీముల్లా

మదనపల్లె టౌన్, మే 31: స్థానిక సర్వజన బోధనాస్పత్రికి కొత్తగా పడకలు, మంచాలు, ఫర్నీచర్లు వచ్చాయి. శుక్రవారం ఏపీఎస్ఎంఐడీసీ డీఈ కరీముల్లాఖాన్ సమక్షంలో ఫర్నీచర్లు దించుకున్నారు. 290 కొత్త పడకలు, మంచాలు, డాక్టర్ల టేబుళ్లు, కంప్యూటర్ టేబుళ్లు, కుర్చీలు, ఫైబర్ కుర్చీలు, అవుట్ పేషెంట్‌వార్డులో రోగులు, కూర్చునే మూడుసీట్ల స్టీలు బెంచీలు వచ్చాయి. మొత్తం సర్వజన బోధనాస్పత్రిలో ఇదివరకే రూ.11.60 కోట్లతో నిర్మించిన కొత్త గదులు, వాటికి అవసరమైన ఫర్నీచర్లు మెగా ఇంజనీరింగ్ సంస్థ సమకూరుస్తోంది.

పార్టీ నేతలను ఎక్కడికక్కడ కట్టడి చేయండి : ఎస్పీ

కలికిరి, మే 31: రాయచోటిలో జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం పార్టీ నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడ కట్టడి చేయాలని ఎస్పీ కృష్ణా రావు ఆదేశించారు. ప్రధానంగా నేర చరిత్ర వున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. కలికిరి పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పోలింగ్ తరువాత పరిణామాల గురించి ఆరా తీశారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పార్టీల నేతలను సమావేశపరిచి కౌన్సెలింగ్ నిర్వహించాలని చెప్పారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు ఆర్. మోహన్, సిబ్బంది హాజరయ్యారు.

నేడు టీడీపీ, బీజేపీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ

కలికిరి, మే 31: పీలేరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం నియమించిన టీడీపీ, బీజేపీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఏర్పాటు చేశారు. శనివారం సాయంకాలం నగరిపల్లెలో జరిగే ఈ శిక్షణకు కౌంటింగ్ ఏజెంట్లంతా హాజరు కావాలని పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కోరారు. శిక్షణకు హాజరయ్యే వారు అవసరమైన గుర్తింపు కార్డులు, ఇతర పత్రాలను తీసుకురావాలని ఆయన సూచించారు.